

శ్రీ విష్ణునుతి శతకము

డాక్టర్, తూములూరు శ్రీదక్షిణామూర్తి శాస్త్రి

1) మ॥ తలపన్ జాలునెవండు దానవ నియన్తన్ బుండరీకాక్షు, ని
స్తుల తేజున్, నిగమాన్తవేద్యు, నిఖలాత్మున్, నిత్య చైతన్యు, ని
శ్చల శాంతున్, ప్రభవిష్ణువిష్ణు, శుచియౌసర్వత్ర, సర్వ ప్రవృ
త్తుల నాతండిహముంబరంబుగను, సంతుష్టుండు ముక్తుండునై।

2) కరముల్ మోడ్చినమస్కరింతు జగముల్ కాపాడ వేవేలుగా
శిరముల్ కన్నులు బాహువుల్ పదములున్ శ్రీమద్యశోనామముల్
బరగన్, విశ్వమనంతమూర్తుల భరింపన్ గల్గు విష్ణున్ బరా
త్పరు నారాయణు నవ్యయున్ వరదు నంతర్బుద్ధిజింతించుచున్

3) క్రతుయజ్ఞంబులు, దానధర్మములు, తీర్థక్షేత్రసందర్శన
వ్రతముల్జేసిన, వేదశాస్త్ర విధులభ్యాసంబు గావించి, స
న్మతిఁబాటించిన గల్గు పుణ్యమది శ్రీనారాయణస్తోత్రమం
చితభక్తిన్ బఠియింప సిద్ధమగు, సుశ్రేయంబులున్గల్గెడున్

4) పరుషోక్తుల్ పలుకంగఁ బాపమొదవున్ ప్రాణంబులన్దీయు,దు
ర్భరమౌజన్మ పరంపరం దవులగా బంధించి, బాధించు; శ్రీ
హరి నామస్మరణంబు పుణ్యఫలమై ఆత్మోన్నతిన్గూర్చు, న
క్షరమౌ విష్ణుపదంబుఁ జేర్చు కలిదోష ధ్వంసమై హంసమై

5) వరదుం డాశ్రితవత్సలుం డజుఁడు విశ్వవ్యాప్తతేజుండు, సుం
దరుఁ డా ఇందిరకుంప్రియుండు పరమార్థ ప్రాపకుండాత్మత
త్త్వరహస్య ప్రతిబోధకుం డమలుఁడవ్యాజానురాగుండు స
ద్గురుఁడానందమయుండు యోగిజనహృద్గుహ్యుండు విష్ణుండగున్

6) చాలంచున్నరితృప్తినిచ్చును బ్రపంచంబందు నన్నోదకం,
బాలోచింపగ, నీరు నన్నమును తానైయుండు నారాయణుం
డేలాయన్యుల నాశ్రయింప? స్థిరమై ఈరేడు లోకంబు లా
మూలంబున్దనియించు, జీవులకు నామోదంబుఁజేకూర్చుచున్

7) కలిలో జీవులనుద్ధరింపగల మార్గంబంచు సూచించి రు
జ్జ్వలమౌ శ్రీహరి నామమందర కుపాస్యంబై యభీష్టంబులన్
గలుగన్జేయు, నరిష్టముల్ దొలఁచు, సౌఖ్యంబుల్ ప్రసాదింపఁగా
సులభోపాయము, ముక్తిధామము మునిస్తుత్యంబు సత్యంబగున్

8) ప్రారబ్ధంబు నశింపజేయఁగ సమర్థం బీసహస్రంబు ని
త్యారాధ్యుండవు విష్ణుమూర్తి మహిమాఖ్యానంబు, పూర్ణంబు, సం
సారోత్తారక మంత్రరాజము, ప్రశంసాపాత్ర మాభీష్మవా
గ్ధారాపూతము సర్వసౌఖ్యద ముపోద్ఘాతంబు వేదాళికిన్

9) మధురంబౌ మధురాంతకున్గథలు సంభావించినన్ జ్ఞానచి
త్సుధలున్గల్గు, హృదంతరంగమున సుజ్యోతుల్ ప్రకాశిల్లెడున్
బుధమందారుఁడు నాశ్రితావనకళాపూర్ణుండు కాపాడెడున్
వ్యధలన్దీర్చుచు, విఘ్నముల్గెడపుచున్ బాధల్ నివారించుచున్

10) కాకులుగింజ లేరుకొని కాలము బుచ్చెడిరీతి నెన్నడున్
లౌకిక జీవనం బమితలౌల్యముతో వెతగూర్చు నెంతయున్,
శోకములేని మార్గమని సూచనఁ జేసిరి యోగులన్నిటన్
దేకువగూర్చు దు:ఖములదీర్చు హరిస్మరణంబుదీర్ఘమై

11) సామర్థ్యంబుగ మానవత్వ విలువల్ చాటన్ నరుండైన శ్రీ
రామున్సత్యపరాక్రమున్గొలుతు, ధైర్యస్థైర్యసంపన్ను వే
దామోదముధర్మ మాచరణతో నాదర్శమౌ సద్గుణో
ద్దామున్ సజ్జనసంస్తుతున్ త్రిజగదాధారున్ మహోదారునిన్

12) పరశువుఁజేతఁబూని మునివర్గము బాధలఁబెట్టు దుర్మతుల్
నరపతులన్ వధించి అధినాయకుఁడై శ్రుతిధర్మమున్ నిరం
తరముగ సాగజేయు శుభధాముఁడు రాముఁడు క్షాత్రమున్మహ
త్తరమగుబ్రాహ్మ్యమున్నిలిపె దద్దయునాశ్రిత కల్పభూజమై

13) సకలోర్వీభరణుండు విష్ణు, వతఁడే సర్వేశ్వరుండౌటెఱుం
గక గర్వాంధులు, విఱ్ఱవీగెదరు విజ్ఞానంబె? ఎచ్చోట నే
రికి నేరీతి విభూతి కల్గినను భూశ్రీనాథు సంపత్తిగా
కిఁక వేరొండెట నుండునే! తెలియరో? ఇంతేని స్వాంతంబునన్

14) ప్రణవంబాపరమాత్మభావమని శాస్త్రంబుల్ప్రబోధించు, త
త్ప్రణవార్థంబు స్మరించుచున్ జపతపోధ్యానాదులన్గొల్వ ని
ర్గుణతత్త్వంబగు బ్రహ్మమున్గన సమర్థుండౌచు, సంసార కా
రణ మజ్ఞానము వీడి, యోగ విదుఁడై రాజిల్లు బ్రహ్మమ్ముగన్

15) శ్రుతి శాస్త్ర స్మృతులు, న్పురాణ కథలున్ స్తోత్రంబులున్ సత్క్రియల్
కృతులున్ శిల్పము నాట్యమున్ గళలు సంగీతంబు భాషల్ జగ
త్పతి సర్వాత్మకుఁడా జనార్దనుని రూపంబై ప్రకాశించు నా
ధృతి, దానేర్పడ జేయఁడే సకలమాతేజోంశ సంపత్తిగన్

16) అమృతోత్పాదన కల్లమంథరము మోయన్గూర్మితో గూర్మమై
సమరోత్సాహులు దైత్యపుంగవుల కాశామోహముల్ గూర్చి ఆ
గముఁడౌ రక్కసు రాహుకేతువులుగా ఖండించి, గీర్వాణవ
ర్గము రక్షించిన దానవాంతకుని నేఁబ్రార్థింతు నశ్రాంతమున్

17) అంతటనున్నవాఁడనెడు నర్థముఁదోప నృసింహ మూర్తియై,
పంతముబూని బాలుఁడగు భక్తుని బాధలపాలు చేయు దు
ర్దాంతుని రక్కసు న్దునిమి రక్షణఁగూర్చిన ఆదిదేవునే
స్వాంతమునన్ భజింతు సుఖశాంతులు వర్ధిల సంతతంబొగిన్

18) అలప్రహ్లాదునిఁబ్రోచుచో తనదు సత్యంబున్ నిరూపింపగా
నిలిచెన్ స్వామి నృసింహరూపమున సాన్నిధ్యంబు సామర్థ్యమున్
దెలుపన్; చూడగ లోకమంతటను తద్దివ్యానుభూతుల్ ప్రవ
ర్తిలు, జ్ఞానంబెనయన్, బ్రసన్నమతి దర్శించున్ బరబ్రహ్మమున్

19) మును దా విష్ణువు; కృష్ణుఁడై జగములన్ బోషింప; సద్ధర్మపా
లన సాగింపగ, గర్వదుర్విధులనెల్లన్ శిక్షగావించి, స
జ్జనకోటిన్బరిరక్షజేసి, ఘనమౌశాస్త్రంబు గీతామృతం
బనుసంధించుచు విశ్వరూపమును వ్యాఖ్యానించె విఖ్యాతుడై

20) కలియుగమందు గల్కియనగా కలుషంబు లడంపఁబుట్టి, యు
జ్జ్వలమగు ధర్మమున్ నడుపజాలినవాఁడనుచు న్బురాణముల్
తెలుపఁగవిందు, మయ్యఖిలతీర్థమయుండు వాసుదేవుఁడన్
తలపె యనుత్తమంబగు పదం బొనగూర్చు బ్రశాంతినిచ్చుచున్

21) శివమున్ శాంతము సుందరంబగుచు వాసింగాంచు నీదివ్యరూ
పవిలాసంబులు వేడ్కతో వినుచు సంభావింపనౌ భాగ్యమీ
యవెలక్ష్మీపతి! నీదు పాదవరివస్యంజేసి జన్మంబు ధ
న్యవిశేషంబుగ జేసికొందు; మహనీయా! భక్త చింతామణీ!

22) నిత్యంబై నిరవద్యమై నిఖిలమై నిస్సంశయంబై ముని
స్తుత్యంబై శ్రుతివేద్యమై శుభదమై శ్రోతవ్యమై స్తోత్రమై
అత్యంతం బనుభావ్యమై సుజనసేవ్యంబై ప్రకాశించు నీ
సత్యం బెవ్వడెరుంగు వాఁడెఘనుఁడీ సర్వప్రపంచంబునన్

23) కృతులన్స్తోత్రములన్ నమస్కృతుల నాకృష్ణున్ బ్రపూజింపగా
గల పుణ్యాత్ములు, ధన్యులౌదు రిహలోకంబందు గీర్తిప్రతి
ష్ఠలు సాధించుచు, జ్ఞాన సంపదలు విస్తారంబుగాఁగల్గి, యా
వల వైకుంఠ పదంబు జేరఁగల రన్వర్థంబు లాజన్మముల్

24) విశ్వంబంతయు విష్ణువౌ; నతఁడె సంవేద్యుండు వేదంబులన్
శశ్వద్భద్రము లిచ్చునాశ్రితులకా సర్వేశ్వరుండార్ద్రతన్!
విశ్వాసంబున జ్ఞానదృష్టులగుచున్ వీక్షింపగా బ్రహ్మమే
విశ్వాకారంబునఁదోచు, సత్యమిది భావింపన్ బ్రపూర్ణుండగున్

25) కలలో దోచిన దృశ్యముల్దెలియ భగ్నంబైనచందంబునం
దిలలోఁగల్గెడు భాగ్యసంతతి తిరంబే? యెన్నఁడెవ్వారికిన్;
వెలయున్భూత భవిష్యకాలముల సంవిద్రూపుఁడై విష్ణు, వా
యనఘున్గొల్చిన వారి జన్మములు ధన్యంబై ప్రవర్తిల్లెడున్

26) శ్రుతులన్‌గాచి, సుధన్‌వెలార్చి, క్షితిసంక్షోభంబు పోఁద్రోచి, సం
శ్రితుబ్రహ్లాదునిఁబ్రోచి, ఇంద్రునకు సంక్షేమంబుఁగల్పించి, దు
ర్మతులన్ శిక్షణఁజేసి, ధర్మమును సంరక్షించు విశ్వాత్మకున్
నతులన్ సన్నుతులన్ భజింతు సుఖమానందంబుఁజేకూర్పఁగన్

27) యోగానందుని యోగనిష్ఠుని మహాయోగేశ్వరున్ యోగదున్
యోగీంద్రస్తుతిపాత్రు, యోగిజనగమ్యున్ యోగసంపన్నునిన్
రాగద్వేష వివర్జితుల్, భవభయారణ్యంబుదాటంగ నౌ
యోగాభ్యాసమునన్ గనుంగొనుటకుద్యుక్తుల్ ప్రమోదింపరే!

28) మదినూహించుటెకాని సత్యమగు బ్రహ్మంబున్ విచారించి తా
నిది ఇట్లుండునటంచు జెప్పనగుననే యెవ్వారి కెవ్వేళ కె
య్యదియావశ్యక మట్టిరూపమును తానై, ధర్మమున్ నిల్పు ని
త్యదయాస్వాంతుని శాంతునిన్ గొలుతు జ్ఞానానందసంపూర్ణునిన్

29) నరనారాయణ తేజ మీజగమునిండన్ సత్తపోధ్యానత
త్పరతన్, లోకము నుద్ధరించు పరమోదారున్ పరంజ్యోతి, న
క్షరు, సంకీర్తన జేసి తత్పదము మ్రొక్కంగల్గు పుణ్యాత్ములా
పరమున్‌జేరి సుఖింతురెన్నఁ,డదెసౌభాగ్యంబు భక్తాళికిన్

30) విద్యాబుద్ధుల, సత్యసుందరకళా విఖ్యాత సంపత్తులన్
వేద్యుం డాభవరోగ వైద్యుఁ డతఁడే విశ్వంబు విశ్వేశ్వరుం,
డాద్యుండాతఁడె యంతమందతఁడె! బ్రహ్మంబై విరాజిల్లు వాఁ
డుద్యద్భాను సహస్రతేజుఁడతనిన్ యోగంబునం జూడనౌ

31) ధృతినెవ్వాని దలంచినన్ దొలగు సందేహంబులున్, భీతి, స
మ్మృతినెవ్వాని భజించినన్ గలుగు సంపత్‌శ్రేణులున్, వాణి, నా
దృతినెవ్వాని నుతించినన్ బొదలు సత్కీర్తి ప్రభావంబు లు
న్నతి, నావిష్ణువు సర్వదోష హరుఁడై నాయజ్ఞతన్ మాన్పడే!

32) భయముల్ భ్రాంతులడంచి నీచరణ సేవా భాగ్యమిప్పించి స
ద్దయఁబ్రోవంగల వాఁడవంచు సుగుణోద్ధామున్ బరంధాము బు
ణ్యయశస్సాంద్రు జనార్దనున్సకల లోకారాధ్యు నిన్వేడుకొం
దు, యథార్థంబగు ప్రాణబంధువని విందున్ తత్త్వమర్థంబుగాన్

33) పరమద్వేషమునన్ సురారి, హరిజంపంబూని ప్రహ్లాదు, ని
ష్ఠురముల్ బల్కుచుస్తంభమందు విభునిన్ జూపింపగర్జించినన్
స్థిరసంకల్పుని భక్తునిన్ మనుప సంసేవ్యుండు విష్ణుండు శ్రీ
నరసింహాకృతి దోచి లోకములకానందంబు కల్పింపఁడే!

34) కాలంబే సకలార్థసాధకము, తత్కాలంబెశీతోష్ణముల్
గ్రాలన్ వత్సర మాస పక్ష తిథులన్ గావించి, సేవింపగా,
కాలంబున్ నియమింపఁజాలు ఘనుకొక్కండా మహావిష్ణు వీ
మూలంబారయజ్ఞానియౌనతఁడు, వ్యామోహంబులన్ బాయుచున్

35) స్థిర సంకల్పముతో బరాత్పరుని సంసేవించు బుణ్యాత్ము లా
స్మరణన్ జన్మపరంపరల్ గడచి, సంసారార్ణవంబున్ దరిం
తురు, మోక్షప్రదుఁ డాజనార్దనుఁడు సంతుష్టిన్ బ్రసాదించున
క్షరమౌ విష్ణుపదంబు, తత్కరుణ నాకాక్షించు భక్తాళికిన్.

36) అనఘుండాతఁ డనంతుఁ డచ్యుతుఁడు సత్యజ్ఞాన మానందమా
తనిరూపంబు, దయార్ద్రచిత్తుఁ డతనిన్ దర్శించుమార్గంబుయో
గనిరూఢంబగు, శిష్టు లిష్టులట, ఆ కల్యాణసంపన్ను వ
ర్ణనజేయన్ బుధులేమిచేసిరొకొపుణ్యంబెన్నగా, సన్నుతిన్

37) ఘనమౌవిష్ణుపదంబుజేరుటకు రాగద్వేషముల్ వీడి, స
జ్జనులన్ గూడి, సమస్తభూతహితులై సౌశీల్యమున్, మైత్రిఁగ
ల్గిన సాధ్యంబగు; భక్తులన్ గరుణరక్షింపన్ సమర్థుండు, మ
న్ననఁగావింపడె సత్యధర్మరతుఁ డానారాయణుండర్మిలిన్

38) జపమా, సాగదు, ధ్యానమా, కుదుర దీసర్వంబునీవన్న జ్ఞా
నపథంబేనెఱుగంగ, దాసుఁడను, సన్తాపంబులన్మాన్పవే
అపరాధంబు లనేకముల్సలుపు నాయజ్ఞానమున్ బాపి, నీ
కృపజూపందగవే, క్షమాగుణునిగా కీర్తింపరే నిన్బుధుల్

39) సహనంబున్ సహకారభావము దయాస్వాంతంబు శాంతంబు లో
కహితైకాచరణప్రవృత్తి, నిరహంకారంబు, నిస్స్వార్థబు
ద్ధి, హృతానేకవిచారుఁడై పరమసిద్ధింగాంచు, యోగంబు ప్ర
త్యహమున్ జేయఁగ; మార్గదర్శియగుయోగానందుఁ డావిష్ణువే.

40) తనువున్ వాక్కుమనంబునొక్కటిగసంధానించి, సంస్కారసం
జనితంబైనప్రబుద్ధి నింద్రియములన్ స్వాధీనమందుంచి, చే
సిన కర్మంబులు సర్వమున్ హరికి సంసేవాప్రవృత్తిన్ సమ
ర్పణగావించినవారికిన్, శుభములున్, భద్రంబులున్, గల్గవే.

41) జగముల్ మూడు, ప్రవర్తిలున్ సతతమాసర్వేశు నాజ్ఞావిశే
షగతిన్, భాసిలుసూర్యచంద్రకృతసంచారంబు, బ్రహ్మాదిదే
వగణంబుల్ తదధీనమైమెలగుచున్ భద్రంబులన్ గాంచు, బ
న్న గశాయిన్ బరమాత్ము, నాత్మదలఁపన్ నాశంబులేదెన్నడున్

42) స్థిరుఁడై శాశ్వతుఁడై వెలుంగు పురుషశ్రేష్ఠున్, సహస్రంబులౌ
శిరముల్ కన్నులు బాహువుల్ పదములున్ చిత్రంబులున్ నామముల్
బరగన్, భక్తినమస్కరింతుఁ, బరితాపంబుల్ నివారించి స
ద్వరముల్ గూర్చు ననంతు, నచ్యుతుఁ గృపాపాంగున్ జగన్నాథునిన్

43) చైతన్యంబొకఁడే; యనేకమగుచున్ సర్వత్రభాసించు నా
యాతత్త్వంబుల నామరూపకృతులందానంత్యమున్ జూపుచున్;
ద్వైతంబున్నటులెదోచు, నీజగము, నద్వైతంబుగా గాంచు చి
జ్జ్యోతిన్ బుద్ధివెలుంగఁజేయు హరి, నే స్తోత్రంబు గావించెదన్

44) శ్రుతివేద్యున్, జితదైత్యు, దేవగణసంస్తుత్యున్, దయాంభోనిధిన్,
శ్రితరక్షాభరణున్, గజేంద్రవరదున్, శ్రీమంతునిన్ శాంతునిన్
కృతులన్ గావ్యములన్ ఘటించి, సుకృతిన్ గీర్తింతు శ్రీగోవిదాం
పతి, బృందావనభూవిహారి, విభునిన్, వందారుమందారునిన్

45) దరహాసాంచితమైన మోమున దయార్ద్రంబాత్మ భావామృతం
బరయందోచు, మహత్వపూర్ణమగు నీఆలాపముల్ గీతయై
పరమార్థప్రతిపాదకంబగుచు సంపన్నంబుగావించు మో
క్ష రమాకాంక్ష, మనోజ్ఞరూపమెనయన్ సాక్షత్కరింపన్ గదే

46) పరమంబైయలరారుధామ, మటబోవంజాలు పుణ్యాత్ము లె
వ్వరురారెన్నడు, జీవలోకములుసర్వం, బంశభూతంబులా
పరతత్త్వంబున, మాయదాటుటకు దైవంబే యుపాయంబు; స
త్వరమాగమ్యముఁజేరు యత్నమొనరింపన్, సౌఖ్య మానందమున్

47) హరినామస్మరణంబె సద్వ్రతము, పుణ్యప్రాప్తికిన్ సాధనం,
బురుతేజో సదనంబు శాంతినిలయం, బుత్సాహ కేంద్రంబు, న
క్షరసంపత్తికినాలవాల, మభయస్థానంబు, సౌరభ్యసుం
దరపుష్పాయతనంబు, స్వాదుఫలసంతానంబు, సర్వంబగున్

48) క్రమమున్ దప్పకచేయు ప్రాణనియతిన్ గాయంబు దార్ఢ్యంబుగా
నమరున్, కంఠముశుద్ధమౌ, కళలు దివ్యత్వంబు సాధించు, రో
గము లంతంబగు, నాత్మధైర్యము, సుసంస్కారంబు దీపించు, యో
గము సిద్ధించు, నభీష్టముల్ కలుగు, తత్కైవల్యమున్ జేకుఱున్

49) పరమాణుస్థితి, పర్వతాకృతియునై భాసించుచైతన్య మ
బ్బురమున్ గూర్చుచు విశ్వమంతటను, సంపూర్ణంబుగా నిండియుం
డు రహస్యంబు, సహస్రనామములుచాటున్, వేదవేద్యంబు, త
త్పరతత్త్వానుభవంబొసంగు, సులభోపాయంబు మోక్షార్థికిన్.

50) శుభముల్ గూర్చుశుభంబు, పాపములు గూర్చున్ దు:ఖభారంబు, దు
ర్లభ మా కర్మఫలంబుదాట, సురలౌబ్రహ్మాదులున్ మార్పలే,
రభయంబీయగఁజాలుదీవ, నరసింహా! సచ్చిదానంద మూ
ర్తి! భజింతున్ శరణాగతార్తిహరకీర్తీ! నన్ను రక్షింపవే.

51) ధనమున్ గోరినుతింతురాధనికులన్, తాపత్రయంబున్ నివా
రణగావించు జనార్దనున్గొలువ, ధర్మం, బర్థ కామంబులు
న్గని, సత్కీర్తికి పాత్రులై తుదకుమోక్షంబందగా నర్వులం
చునుబోధించిరి సంయమీంద్రులుఋషుల్; స్తుత్యుండువిష్ణుండగున్.

52) ప్రాణంబే ప్రణవంబు, తత్ప్రణవమే రాజిల్లు నీతేజ, మీ
ప్రాణుల్ నీప్రతిరూపులౌదురు, మహత్ప్రాణంబ వీవౌచు సం
త్రాణంబున్ బొనరింతు వీజగముచైతన్యంబుగాఁ జేయుచున్
వాణీవల్లభసంస్తుతా! త్రిభువనవ్యాప్తా! జ్ఞాన మోక్షప్రదా

53) కవితా గంగ సువర్ణయుక్తి నభిషేకంబై విరాజిల్లెడున్,
కవితాగంధము శీతలంబగుచుసౌఖ్యంబిచ్చు నీకెప్పుడున్,
కవితాపుష్ప మలంకృతిన్బొలుచు సౌగంధ్యంబుఁ జేకూర్చుచున్
కవితామాధ్వి నివేదనంబగు రసజ్ఞా! పద్మనాభప్రభూ!

54) కాలాత్ముండవు, కాలమున్నదుపు నీకారుణ్యమే సృష్టికి
న్మూలంబైతనరారు, సద్విలసనంబున్ జెందు, సర్వంబు నీ
లో లీనంబగు; సర్వశక్తుఁడవు, కల్లోలంబులన్ మాన్పి, దు
శ్శీలంబున్ బరిమార్పవే జగములన్; శ్రీమన్నృసింహాకృతిన్.

55) వేదంబుల్పఠియింప, దీర్థములలో వేమారుస్నానంబు, లె
న్నో దానంబులుచేయు పుణ్యఫలమేదో, యద్దిసిద్ధించు, నా
మోదంబేర్పడనిచ్చు విష్ణువని, ఉద్బోధింపరే సద్బుధుల్
శ్రీదామోదరుసంస్తుతింప గలుగున్ శ్రేయంబులున్ క్షేమముల్.

56) సకలైశ్వర్యమునీయధీన, మదివిశ్వంబెల్లవ్యాపించు, నీ
కొక లేశంబు వికారమున్ గలుగ, దాత్మోత్కర్షులీక్షింప నే
రక, మాత్సర్యముతోఁజరించెదరు; సర్వస్వామ్యముల్ నీవె! పా
యకరక్షించుట నీస్వభావము దయాఢ్యా! శ్రీనివాసప్రభూ!

57) చైతన్యంబొక డీసమస్తజగమున్ సంసృష్టి గావించి, త
చ్చేతో మోదమెలర్పఁ బెంచుఁ, దనలో జేర్చున్ వినోదంబుగా;
ఆతానే, సకలప్రపంచమగుచున్ వ్యాపించు, దీపించు స
ర్వాతీతస్థితి; నద్దినీవనుట సత్యం బాత్మవిద్యానిధీ!

58) సత్యం జ్ఞాన మనంతమైవెలుగు నాచైతన్యమున్ యోగియై
నిత్యంబాత్మదలంచి, శ్వాసగతి నన్వేషించి హంసోస్థితిన్
ప్రత్యాహార సమాధులన్ బడసి, జీవబ్రహ్మ భావంబుతో
నత్యంతంబు సుఖించుఁదా హరి కనన్యంబంచు జింతించుచున్

59) ఛలవృత్తంబులనో బాపవిత్తముల విస్తారంబుగాఁబేర్చి, ని
చ్చలు శాస్త్రోక్తములైన ధర్మవిధులన్ జాలించి, వాదించు మూ
ర్ఖులకెల్లన్ గలికల్మషంబు లడఁగన్ గోవిందనామంబు లి
మ్ములఁ గీర్తించు టిహంబుఁగూర్చుచు, బరంబున్ జేరుమార్గంబగున్

60) తనలో ప్రాణములుండునంతవఱకే దారాసుతాదుల్; గతిం
చిన మన్నింతురె బంధుమిత్రులును, రక్షింపన్ సమర్థుండు చి
ద్ఘనుఁడాదైవము వాసుదేవుఁ, డతనిన్, దర్పంబుఁబోనాడి కొ
ల్చిన క్షేమంబిడు; దీపముండగనె యిల్దిద్దంగ చక్కంబడున్

61) జడమౌనీజగ మాత్మయోగమును సంసారంబుగా నెంచునె
న్నడు; శ్రీ, భూ సహితుండు విష్ణువను నీనామంబుసంకేతమై
ఇడతోఁ బింగళతోసుషుమ్న యుతమై ఏపారుటన్ దెల్పు, న
య్యెడనానందము తాండవించు నదెనీకెన్నన్ స్వరూపంబగున్

62) పరమానందకరంబు తత్స్మరణ, మవ్యాజంబు తత్ప్రేమ, దు
ర్భరదారిద్ర్యశమంబు తత్కరుణ, సర్వశ్రేయముల్ గూర్చు త
చ్చరణాబ్జంబులసేవ, జన్మజరలన్ శ్రాంతింపగాజేయు ది
వ్యరసాపూర మధోక్షజున్ వరము, లాధ్యానంబె యోగంబగున్.

63) ఏయేవేళల, గ్లాని, ధర్మమునకేయేరీతులన్ గల్గునో
ఆయావేళల ధర్మ ముద్ధరణఁ జేయన్ బుట్టు నాదైవమున్
శ్రేయంబందగలార లాశ్రితులు సౌశీల్యంబు పెంపొంద; నే
మాయల్ సేయగలేరు మాధవుని దుర్మానంబుతో రక్కసుల్

64) అధికారంబు, ధనంబు, యౌవనబలం బాత్మీయతాబంధముల్
బుధులేనాడుగణింప రవ్వి క్షణికంబుల్, ప్రమాదంబులున్;
మధురంబామధురాంతకున్ గథ, మనోమాలిన్యమున్ ద్రోచు, దు
ర్వ్యథలన్ మాన్పుచు, చిత్సుధారసము నాస్వాదింపగా జేయుచున్

65) సకలైశ్వర్యము లక్ష్మిగాఁ గొలుచు విశ్వం, బద్దిలేకున్న నే
రికి, నేగౌరవ మాదరంబొదవునే; శ్రీసూక్తమున్ జెప్పి, కో
రికలీడేరగ వేడుకొందు రయినన్, శ్రీదేవి, లోకైకనా
యకుఁడా విష్ణుమనోనుకూలయయి దివ్యత్వంబు సాధింపదే

66) పరమాత్ముండగు విష్ణువున్ సకలవిశ్వంబందు దర్శించు వా
రరయన్ జ్ఞానులు; తత్స్వరూపమును వ్యాఖ్యానించు వేదంబులున్
తరుమూలంబుల, శాఖలన్, జివురులన్, తద్ధర్మమేతోచు న
క్షరసత్యంబది, దేశకాలవిషయాసంగంబు కాదెన్నగన్.

67) చరమున్ స్థావరమౌజగంబున సమస్తంబాతడెన్నన్, నిరం
తరమావిష్ణుఁ, దలంప పుణ్యఫలముల్ దాఁగూరు, నేర్పొప్పగా
నరకక్లేశములన్ దరించి, నరునిన్ నారాయణున్ రూపమై
వరలన్ జేయుఁ గృపారసంబుఁ బ్రసరింపన్జేసి భక్తౌఘమున్

68) గురురూపంబునదోచి, భక్తి నతులన్ గొల్వంగ శిష్యాళి, కా
దరమేపారగ మంత్రతంత్రవిధు లుత్సాహంబుతోఁ జెప్పి, త
త్త్వరహస్యంబులుతెల్పి, ఆత్మ పరమాత్మజ్ఞానమున్ గూర్చు స
త్కరుణామూర్తిని, విష్ణుమూర్తియను సద్భావంబుతోఁ జూడరే.

69) విసమున్ గ్రక్కెడునాగులైన హరిసేవించున్ వినమ్రమ్ముగా,
కసవున్ మేయు పశుప్రపంచమును తత్కారుణ్య పాత్రమ్మె, ఆ
కసమందున్ విహరించు పక్షులును సత్కారమ్ముతో మోయుచుం
డు, సమీక్షింపదు మానవాళి మనమందున్ సత్యధర్మమ్ములన్

70) ఏవిఘ్నంబులుకల్గకుండుటకుఁ బ్రార్థింతున్ బ్రసన్నాననున్
గోవిందున్ బురుషోత్తమున్ బరము, వైకుంఠున్ మహావిష్ణువున్
దేవేంద్రాది సమస్తలోక వినుతున్, దివ్యత్ప్రభా భాసురున్,
భావాతీతు, జతుర్భుజున్, శశినిభున్ శుక్లాంబరశ్రీధరున్

71) నరజన్మంబతిదుర్లభంబు, తిరుమంత్రంబెంతొ శ్రేష్ఠంబు, దు
స్తర సంసారసముద్రమున్ గడవ భద్రంబైన నావంఘటిం
చి, రుపాయంబుగ, రామనామ, మఖిలశ్రేయంబులన్ గూర్చు; స
త్వరమావిష్ణుని పాదరందు, శ్రుతి విద్యాసారసర్వస్వమున్

72) జగదాధారుఁడు, సర్వలోకహితుఁడున్, శాంతస్వభావుండు స
త్వగుణోపేతుఁడు, సత్యనిష్ఠుఁడు, మహాధర్మస్వరూపుండు, స
ర్వగుఁ డాతం, దఖిలాంతరాత్ముఁడమరవ్రాతంబు గొల్వన్ మహో
రగతల్పంబున లక్ష్మి తత్పదములారాధింప వెల్గొందెడున్

73) గోవిందా! యనుచున్ నిరంతరము సద్గోష్ఠుల్, కథల్, కీర్తనల్,
గోవిందా! యనిస్నానముల్ జపములున్, గోవిందునిన్, ధ్యానముల్
సేవాతత్పరులౌచు, భూతతతి నుజ్జీవింపగాఁ జేయుచున్,
భావంబందున బాహ్యమందున, హరిన్ భావింప భద్రంబగున్

74) శ్రీరామున్, సుగుణాభిరాము, విజయున్, సీతామనోనాయకున్
వీరాగ్రేసరు సత్యధర్మనిలయున్, వేదప్రతిష్ఠా మహో
దారున్, ధీరుని, యజ్ఞరక్షణకృతోత్సాహున్, బుధారాధ్యునిన్
పారావారగభీరునిన్ మునిహితప్రారంభునిన్ గొల్చెదన్

75) భగవంతున్ బరమున్, పరాత్పరుని, విశ్వవ్యాపకున్ విష్ణునిన్,
జగదాధారుని, శాంతచిత్తునిఁ, గృపాసంపన్ను, లక్ష్మీపతిన్
నిగమాంతప్రతిపాద్యు, నిత్యు, నిరతోన్నిద్రున్ బ్రసన్నాత్ము, ధీ
రు, గభీరున్, బ్రణవస్వరూపు, వరవర్ణున్, గృష్ణు, సేవింపరే.

76) అతనిన్ గొల్వ, జగంబులన్ గొలిచినట్లౌ, నాతఁడున్ దిన్న, భూ
త తతుల్ తిన్నటులౌను, సర్వమున నాతండుండు, సర్వత్ర సం
శ్రితులన్ గావగ, ధర్మమున్ నిలుపగా శ్రీకృష్ణుఁడైపుట్టె భా
రతభూమిన్; ఖలులన్, వధించి, పరమార్థంబున్ బ్రబోధింపగన్

77) పరమానందము, మాధవున్మహిమ సంభావింప, ప్రారబ్ధబం
ధురమైవచ్చినమూకభావమును పోఁద్రోవన్ సమర్థంబగున్
పరుగుల్ దీయుచుఁగొండలన్గడచు శేవన్ మించుపంగుండు, త
త్కరుణావీక్షణమున్నఁజాలు త్రిజగత్కల్యాణ మేపారెడున్

78) ఎవరేమార్గమునన్ ప్రవర్తిలిన నిన్నేచేరరే? శర్వ! ని
న్నెవరేరూపము నన్భజించినను నట్లేదర్శనంబిత్తు, వు
ద్భవమైనీయెడ వృద్ధిగాంచు జగమంతర్భావమున్ జెందు, నీ
యవనిన్‌బుట్టు మహానదుల్ జలధినెయ్యంబారజేరున్ దుదిన్

79) చేతోమోదమెలర్ప విష్ణుఁడు, జగత్ క్షేమంకరుండెన్న స
ర్వాతీతుం డఖిలాంతరాత్ముఁ డజితుండానందుఁ డవ్యంగుఁ డా
భూతావాసుని వాసుదేవు ననయంబున్భక్తిభావంబుతోఁ
జేతుల్ మోడ్చినమస్కరింతు సకల శ్రేయంబులన్ గూర్పగన్

80) వేదాదిన్ స్మరియింత్రునిన్ను, బుధులేవేళన్ సమాప్తిన్ వలెన్
పాదాలన్ బ్రభవించు గంగకు నదీప్రాధాన్య మొప్పారె, నిన్
మోదంబొప్ప వరించులక్ష్మి జగదామోదంబుఁగాంచెన్, మహా
త్మా! దామోదరునిన్ను మోయు నురగుండారాధ్యుఁడౌ శేషుఁడున్

81) జనముల్ బాధలు పొందగా విషముప్రస్థాపించు కాళీయు మ
ర్ధనగావించె, ఖగేంద్రుఁ డాసుధను సంరంక్షించి స్వర్గాళికి
చ్చిన, మన్నించి వరంబులిచ్చె, తనదౌ సేవల్ ప్రసాదించుచున్;
గొనమే అన్నిటికన్న మిన్న, అదియే గోవిందు నిష్టంబగున్

82) హరినామం బెదవిస్మరింపఁబడుటే, యత్యంతదు:ఖంబగున్
హరినామస్మరణంబె, సంపదయగున్ వ్యామోహముల్ బాపుచున్
క్షరముల్ తక్కినవెల్ల, నక్షరము తత్సర్వేశ్వరానుగ్రహం
బరయన్ ముక్తికిమార్గమౌననిరి ఆవ్యాసాదులౌ సద్గురుల్

83) హృదయంబందు జనార్దనుస్దలప, నా ఇందీవరశ్యాముఁ డా
పదలన్ బాపు, జయంబు, లాభమొనగూర్పంబూనుచున్, బుణ్య సం
పదలన్ జేర్చు, పరాభవం బపనయింపన్ జేసి, సన్మంగళా
స్పదుఁడా విష్ణు వొసంగు సర్వశుభముల్ సంప్రీతి నెల్లప్పుడున్

84) స్తవముల్ సేయుచు, నర్చనల్సలుపుచున్, ధ్యానంబునన్ జూచు మా
నవులేవేళల సర్వధర్మవిదునిన్ నారాయణున్ గొల్చు, టు
త్సవమైపొల్చు, విశేషధర్మమిదియే ధర్మమ్ములందన్నిటన్,
భవమున్ బాసి, వికుంఠవాసులయి, తద్భక్తుల్ విభాసింపగన్

85) మతినీవే, గతినీవె శ్రీపతి! నుతింపన్శక్యమే నిన్ను, స
మ్మతినీపాదసరోజసేవలు ఘటింపన్ జేయవే, పాపసం
గతులన్ ద్రోచి కృపామతిన్మనుపవే, కాలంబు నీచేఁ బ్రవ
ర్తితమౌనెప్పుడు, సత్యరూపుఁడవు, శాంతిన్ దాంతి చేకూర్పవే.

86) అడుగుల్ ముందుకువేయ నిష్టపడబో, మాశింతు మైశ్వర్య మే
ర్పడ, నభ్యాసములేకయే విపులమౌపాండిత్యమున్, త్యాగమె
న్నఁడుఁగావింపక కీర్తిసంపద లనంతంబుల్ ప్రసాదింపగా
నడుగన్ బూనుదు మిందిరారమణ! మా అజ్ఞానమున్ మాన్పవే

87) స్థిరచిత్తంబును, ధర్మవర్తనము, నర్థింతున్ బ్రసాదింప; నీ
కరుణాలేశముచేతనే సురలు దిక్పాలాదులై కీర్తిగాం
చిరి, సూర్యానలచంద్రులై వెలిగి రక్షీణప్రభావంబునన్;
బరమానందమొసంగవే కృపను, దేవా! ఆదినారాయణా!

88) ముక్తిన్గోరక, మృత్యువున్గెలుచు వ్యామోహంబుతోరక్కసుల్,
యుక్తాయుక్త విచక్షణల్మరచి యుద్ధోన్మాదులై వర్తిలన్;
యుక్తిన్, వారిజయించిలోకులకు సద్యోగంబుఁ గల్పింప ధీ
శక్తిన్జూపు త్రివిక్రమా! గొలుతు నాశాపాశముల్ ద్రుంపగన్

89) మునులంతర్ముఖులై నినున్ గొలువ, నామోదంబుతో వారికా
త్మను దర్శింపగఁజేసి, ముక్తినిడుచున్మన్నించు దేవాదిదే
వుని, నిన్నున్ స్మరియించు భాగ్యమెటులబ్బున్ బుణ్యలేశంబులే
క, నివారింపవె దుష్టసంస్కృతులు, దుష్కార్యంబు, లుత్సాహివై

90) త్యాగంబుల్ చిరకీర్తి సంపదలకున్ స్థానంబులైవర్థిలున్
భోగంబుల్ క్షణికంబు లాపదలకున్ బుట్టిండ్లుగానుండు, నో
యోగీశా! ధృతి నా దధీచి, మహితోద్యోగంబుగా ప్రాణముల్
త్యాగంబున్బొనరించె లోకహితుఁడై ఆదర్శమున్ నిల్పుచున్

91) మును సత్యవ్రత మాచరించుఘనుఁడంభోజాక్షు కారుణ్యమున్
గని, దు:ఖంబులుబాసి, శాంతిసుఖముల్ గల్గన్, బ్రమోదింపఁడే?
మనమున్ వాక్కును కాయమున్ గలిపి, సమ్మానంబుతోఁగొల్చు భ
క్తునిజన్మంబు విశిష్టమౌ; నతఁడు ముక్తుండౌ భయభ్రాంతులన్.

92) అన్నంబా హరి, రూపమే; తినెడువాఁడాతండె, దేహస్థుఁడై
యన్నంబెల్లఁ బచించునాల్గుగతులం, దాతండె విజ్ఞానసం
పన్నంబైయలరారుగీతవెలయింపన్ జేసెనాచార్యుఁడై
కన్నుల్గానని విశ్వరూపము గనంగాఁజూపె నప్పార్థునిన్.

93) భగవంతుండు, సృజించు నీజగములన్ బాలించు, జాలించు లీ
ల, గుణోపేతుఁడు నిర్గుణుండగుచు; స(త)ద్ గ్లానిన్ నివారించు, మ్రొ
క్కగ దిక్కై కరిరాజుఁగాచె, మకరిన్ ఖండించె, శాపంబు లి
మ్ముగఁబోద్రోయుచు ముక్తిగూర్చు పరమాత్మున్ భక్తిఁ గీర్తించెదన్

94) తనుగావించిన మేలెఱుంగక నిరాధారంబుగా నిందజే
సినవారిన్దగఁగాచునట్టి కరుణాసింధున్, బ్రసన్నాత్ము, నెం
తనిగీర్తింతు; సురేంద్రవందితు జగన్నాథున్ రమానాయకున్
మనసూహింపగలేదు, కన్నులకు సామర్థ్యంబు లేదారయన్

95) భ్రమలన్మాన్పి యథార్థమున్ దెలియఁ జెప్పన్ దైవమెన్నో ప్రయ
త్నములన్ జేయుచు విశ్వరూపమును సందర్శింపగాఁజేసె, స
ర్వముదానై, సకలంబు గూర్చు పరతత్త్వంబాతఁడైయుండి ధ
ర్మము రక్షించె, నధర్మమున్దునిమెఁ గర్తవ్యంబు సూచించుచున్

96) నవరంధ్రంబులతోలుతిత్తి, నరుదందంగాలిఁ బూరించి, ఆ
భువనాధీశుఁడు, నాటలాడుననిశంబున్ మిత్రబృందంబుఁ గూ
డి విలాసంబుగ, కాళ్ళుచేతులను తాడించున్ సముత్సాహియై
అవిరోధంబుగపైకి క్రిందికిని త్రోయంబూను చాయావిధిన్.

97) హరిపాదాంబుజముల్ భజింపగలభాగ్యంబంది. తన్నామ సం
స్మరణంబేమఱకుండు పుణ్యమతులా స్వామిన్ బ్రకీర్తించి, దు
ర్భరదు:ఖంబులుదాటి, దివ్యపదమౌ వైకుంఠమున్ చేరుకొం
దురు, సర్వోత్తముఁడైన ఆవిభుని విష్ణున్గాంతు రానందులై.

98) మాయామోహములంతరంగమునఁగామక్రోధముల్ బెంప, హిం
సాయత్తుల్ మదమత్తచిత్తులనివార్యంబై విజృంభింప, న
న్యాయంబున్పరిమార్చి, ధర్మమునకౌన్నత్యంబుఁజేకూర్చి, స
ద్ధేయుం డాపురుషోత్తముండు పరిరక్షించున్ బ్రపంచంబులన్

99) పురుషార్థంబు లొసంగు నాల్గు నిరతంబున్ శ్రీమహాదేవుఁడన్
బరమార్థంబెఱుఁగన్ జతుర్భుజుఁడు తాఁగన్పట్టున్ బ్రసన్నుండుగా;
పరమంత్రంబులు, తంత్రముల్ గెలుచుదివ్యంబైన సర్వాయుధ
స్ఫురణన్దోచు సురేంద్ర వందిత పదాబ్జున్ విష్ణుఁగీర్తించెదన్

100) పలుత్రోవల్ ప్రసరించునింద్రియము లీ బాహ్యంబునన్ బారగా,
నలసత్వంబునఁజూడ దీజగము సర్వాత్మున్, హృషీకేశునిన్;
కొలువైయుండునతండెడందఁ గడునిగ్గుల్గూర్చు తేజంబునన్
దలపోయన్ సుఖమబ్బు, నిత్యమగుసత్యం, బిద్ది కర్యవ్యమౌ.

101) వరమై లోకవరేణ్యమై వరదమై వర్ధిల్లు నారాయణ
స్మరణం బార్తిహరం బమేయఫలమై శాంతిన్ బ్రసాదించు, న
క్షరమౌ మోక్షపదంబునిచ్చు బుధులాకాంక్షింతురావిష్ణు మం
దిరసందర్శన భాగ్యమాత్మవిదులై దివ్యానుభావంబులన్.

102) భవబంధంబులెడల్ప, ముక్తిసమకూర్పంగా, సమర్థుండు స
త్యవచశ్శీలుడు, శూరుఁ, డాహవజయోత్సాహుండు, భక్తావన
ప్రవణుం డాగమ ధర్మరక్షకుఁడు, సర్వజ్ఞుండు సర్వేశ్వరుం
డవు గోవిందుని, మాధవుంగొలుతు; బ్రహ్మంబంచుఁ జింతించుచున్

103) ఖగరాడ్వాహనుఁడాశ్రితావనుఁడు విఖ్యాతుండు శ్రీశంఖచ
క్రగదాఖడ్గధనుర్ధరుండు క్రతురక్షాదీక్షితుండాద్యుఁడా
భగవద్రూపముసర్వమీజగము; తద్వైవిధ్య మెవ్వారికె
న్నగశక్యంబె యనల్పకల్పనలవిన్నాణంబుఁ జూపించుచున్.

104) కలి, నేకాదశి సద్వ్రతంబెనయ దు:ఖంబుల్ నివారంబులై
కలుగున్ బుణ్యఫలంబులన్న గురువాక్యంబెంచి, నిన్భక్తితో
దలఁతున్‌శార్ఙ్గ సుదర్శనాదు లనుసంధానించి, పాపౌఘముల్
తొలగన్ ద్రోయగ; ధర్మ కర్మములచేతోమోద మేపారగన్

105) మనదేహంబుననుండు చేతనసుషుమ్నాశక్తి; యద్దానినే,
ముని లధ్యాత్మపరంబుఁగా నుడివిరంభోజాక్షుఁడౌనంచు సా
ధనసేయన్ సకలంబుసాధ్య, మభవుస్దర్శింపఁగానౌనెదన్
మును స్తంభంబునఁ దోచెవిష్ణువనుచున్ బోధింపఁదేవ్యాసుఁడున్

106) బలవంతంబుగమాయ, నింద్రియములన్ బంధించి, విద్వాంసులన్
గలఁచున్; బుద్ధి నశింపఁజేయు, నెద రాగద్వేషముల్ బెంచు, ను
జ్జ్వలమౌజ్ఞానమడంచు, శాంతిసుఖముల్ సర్వంబు దూరంబుఁగా
నిలుపున్; విష్ణుభజింపదుర్గతులనన్నింటిన్ నివారింపఁడే

107) పితురుల్ ముక్తిగనన్ గదాధరునిసేవింతు ర్గయాక్షేత్రమం
దతఁడాగంగనొసంగె లోకముల పాపౌఘంబు బోద్రోసి, స
ద్గతులన్ గూర్పగ: సత్యధర్మరతులై దామోదరున్గొల్వ సం
తతమారోగ్యము, భోగభాగ్యములు, సత్సంతానమున్ గల్గవే

108) శ్రీరామున్, సకలాధినాథు, కరుణాసింధున్, జగద్బంధు, లో
కారాధ్యున్, స్థిరధర్మవర్తనుని, శిష్టాచార సంపన్ను, సం
సారారణ్యభయంబుమాన్పి, సుఖమున్ శాంతంబుఁజేకూర్ప గం
భీరున్, ధీరు, భజింతు; రక్షణముగావింపన్ బ్రపన్నుండనై.

109) మరుజన్మంబెటులుండునో, తెలియదామర్మంబు; స్త్రీయౌనొ, తా
పురుషుండో, క్రిమి, పక్షి, వృక్ష, పశులన్, బుట్టించునో కర్మముల్;
హరిపాదంబులనాశ్రయింప, నతఁడాప్యాయంబుగాఁ జూచి, చె
చ్చెరవైకుంఠ పురంబుజేర్చుఁ, బరమశ్రేయంబులన్, గూర్చుచున్

110) సతతంబూహల పల్లకిన్ దిరుగుచున్ సంసార సౌఖ్యంబు శా
శ్వతమంచున్ భ్రమియించు నాకొసఁగవే తత్త్వార్థ సంపత్తి, సం
స్తుతిగావింతుఁ, ద్వదీయ పుణ్యచరితల్ శ్రుత్యంత సంవేద్యముల్;
మతినీవే, గతినీవె, సర్వులకు గమ్యంబీవె; లక్ష్మీపతీ!

111) గురుఁడున్ లోకగురుండు జ్ఞానియు, సమగ్రుండున్ గృపాపూర్ణసా
గురుఁడార్తావన దీక్షితుండు, సుర రక్షాదక్షుఁడుర్వీమనో
హరుఁడున్, సత్యపరాక్రముం డసుర సంహార ప్రవీణుండు,ని
త్యరమాసేవితు, నాశ్రయింపరె సమస్తైశ్వర్యముల్ గూర్పగన్

112) శ్రీమంతుండవు నీవొకండవన లక్ష్మీదేవి నిన్గొల్వఁగా,
ధీమంతుండవు, శౌర్యశాలివని కీర్తించున్ శ్రుతుల్; యోగమున్
క్షేమంబేర్పడ భక్తులన్ గరుణ రక్షింపన్ సమర్థుండవీ
వే, మాదిక్కని నమ్మినా మెదను; స్వామీ! మమ్మువీక్షింపవే

113) అలనారాయణుఁడాది దైవము, జగంబతటన్ నిండి, ని
శ్చలుఁడున్ నిస్తులుఁడైవిరాజిలు; సమస్తంబీప్రపంచంబు ని
చ్చలు తత్ర్పాభవ వైభవంబులఁ బ్రశస్తం, బంతాటన్ సూర్యచం
ద్రుల దృష్టుల్ ప్రసరించిచూచుఁ; గడునేర్పున్ దీర్పు సంధిల్లగన్

114) వ్రత, యజ్ఞంబులు, మంత్ర తంత్రములు నిర్వర్తించువేళన్ బ్రవ
ర్థితమౌ విఘ్నతమంబుఁ బాపి, శుభముల్ దీపింపగాఁజేయు ను
న్నతి విష్ణుస్మరణంబు; భక్తులకు పుణ్యంబెన్నఁ దన్నామ మా
దృతి విన్నన్; సకలాఘముల్ దొలఁగు; సందేహంబు లేదేయెడన్

115) జగముల్ మూడు పదత్రయంబున విశేషంబొప్పగాఁగొల్చి, చూ
డఁగ, సర్వంబును నీదిగాఁ దెలుపు ప్రౌఢత్వంబు వర్ణింపవే
నిగమంబుల్; నిను వామనుండనుట మానేరంబుకాదో? సురా
పగ నీపాదములన్ జనించుట ననల్పంబై, ప్రశంసల్ గనున్.

116) గురుమూర్తిన్ గడు భక్తితోఁగొలువఁగల్గున్ జ్ఞానసంపత్తి, శ్రీ
ధరు, నవ్వానిఁదలంచినంత జగదంతర్యామి, హర్షించుచున్
వరముల్ గూర్చు, భయంబుదీర్చుఁ బరమార్థంబున్ బ్రసాదించు, యో
గరహస్యంబు దయార్ద్ర బుద్ధినొసఁగున్ గల్యాణ సంధాయియై.

117) వెలుఁగుల్ వేనకువేలుఁబోలునొకొ, ఈవేవెల్గు నెందైన జీ
వులకారోగ్యమునన్న మేర్పడఁదమిన్ బోషించుచున్, బుద్ధి శ
క్తుల నుద్దీపనఁజేయఁజాలు మహితాత్మున్ సూర్యనారాయణున్;
గొలువన్ జాడ్యములంతరించుఁ గలుముల్ కోకొలలౌ నన్నిటన్

118) ప్రత్యక్షంబగు దైవమీరవినియారాధింతునేవేళఁ దా
నత్యంతంబనురాగ మూర్తియయి ఆహారాదికంబిచ్చు నా
సత్యంబెంచుచు, తల్లి దండ్రి గురుఁడీసర్వంబునౌజ్యోతి, నా
దిత్యున్గొల్చెద; దేవదేవుని సురాధీశున్ గృతజ్ఞుండనై



రచయిత :

భాషాప్రవీణ, విద్యాప్రవీణ

డాక్టర్ తూములూరు శ్రీదక్షిణామూర్తి శాస్త్రి M.A. Ph.D

శాస్త్రిగారి ఇతర రచనలు - ప్రచురణలు

ముద్రితములు

1. శ్రీ రామకథామృతము - సమగ్ర సమీక్ష ఆంధ్రా యూనివర్సిటీ వారిచే Ph.D. పొందిన పరిశోధన నిబంధము.
2. రామాయణం-సమాజ దర్పణం 1వ భాగము
3. రామాయణం-సమాజ దర్పణం 2వ భాగము
4. శ్రీరామ వాణి
5. వాల్మీకి వాణి
6. హనుమద్వాణి
7. పావనీ శతకము
8. మహాభారత పారిజాతము (సంకలనము) శ్రీలలితాసహస్రనామ వివరణము (అముద్రితము)
9. మాటలంటే మాటలా ?
10. ముసునూరివారి వంశ చరిత్ర
11. తెలుగు వ్యాకరణము
12. భావదేవ శతకము
13. శ్రీ వీరాంజనేయ శతకము
14. శ్రీ సత్యనారాయణ శతకము
15. శ్రీ కపోతేశ్వర శతకము
16. శ్రీ రాజరాజేశ్వరీ శతకము
17. శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రము ప్రతిపదార్థసహితము
18. శ్రీ త్రికూటేశ్వర త్రిశతి
19. యోగవైభవము.

సుమధుర సంస్కృత సూక్తులు

(మొదటి భాగము)



రచయిత :

భాషాప్రవీణ, విద్యాప్రవీణ

డాక్టర్, తూములూరు శ్రీదక్షిణామూర్తిశాస్త్రి

ఎమ్.ఏ., పిహెచ్.డి.

పొన్నూరు, 81067 66197